AKSHARA TODAY
అక్షర రథుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనం



2



హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

2

తెయూలో పీజీ నాల్గో సెమిస్టర్ ఫలితాలు విడుదల



అక్షరటుడే, తెయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీలో పీజీ (2024 బ్యాచ్) నాల్గో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ మేరకు వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, కంట్రోలర్ సంపత్ కుమార్‌తో ఫలితాలను విడుదల చేశారు. 13 సబ్జెక్టుల వారీగా విద్యార్థులు సాధించిన ఫలితాలను తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్లో పొందుపర్చినట్లు కంట్రోలర్ తెలిపారు.



విద్యుత్ కోతలకు సీఎం వైఫల్యమే కారణం : గంప గోవర్ధన్

అక్షరటుడే, కామారెడ్డి: రాష్ట్రంలో విద్యుత్ కోతలకు సీఎం తప్పిదమే కారణమని, తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెట్టేస్తున్నారని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ విమర్శించారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.హడావుడిగా విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నిసార్లు చెప్పినా మారరా అంటూ ముఖ్యమంత్రి బెదిరించడం సరికాదని అన్నారు. సీఎం తప్పిదంతో కరెంట్ కోతలు వస్తే సురేష్ అనే అధికారిని సస్పెండ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రాకముందు రాష్ట్రంలో ఇదే పరిస్థితి ఉండేదని, 2014 తర్వాత మూడేళ్లలో వేల కోట్లు ఖర్చు చేసి గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు 24 గంటల కరెంట్ సరఫరా చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ఉన్న అధికారులే ఇప్పుడు కూడా ఉన్నప్పుడు కోతలు లేని కరెంట్ ఇవ్వడం ఎందుకు చేతకావడం లేదని ప్రశ్నించారు. ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని, ప్రపంచ వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంటే ఒక్క తెలంగాణలోనే కోతలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఐక్యరాజ్యసమితి ముందే హెచ్చరించినా సీఎం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని గంప గోవర్ధన్ విమర్శించారు. ఆదిలాబాద్‌లో రైతులు అర్ధనగ్నంగా తలకిందులుగా నిరసన చేయడం సీఎం అసమర్థతకు నిదర్శనన్నారు. ప్రభాకర్ రెడ్డి, కాసర్ల స్వామి, హఫీజ్, భాను ప్రసాద్, మామిండ్ల లక్ష్మణ్, గోపు నర్సింలు, కృష్ణాజిరావు, కుంబాల రవి యాదవ్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీ



అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

57 పోస్టులు..

కళాశాలలో మొత్తం 57 పోస్టులు ఖాళీలు ఉండగా ఇందులో 5 ప్రొఫెసర్ పోస్టులు, 14 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 20 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 18 సీనియర్ రెసిడెంట్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ నెల 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు http://www.gmckamareddy.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.



ట్రాఫిక్‌తో టెన్షన్..టెన్షన్..

- కామారెడ్డిలో అస్తవ్యస్తంగా రోడ్లు
- జంక్షన్ల ఏర్పాటులో నిర్లక్ష్యం
- విస్తరణకు నోచుకోని రహదారులు
- పార్కింగ్ సౌకర్యం కరువు
- ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు

మూడు రాష్ట్రాలు, నాలుగు జిల్లాలకు కూడలిగా ఉన్న కామారెడ్డి పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. జాతీయ రహదారి అందుబాటులో ఉండటం, పట్టణం మీదుగా రైల్వేమార్గం వెళ్లడంతో వ్యాపార లావాదేవీలు జోరుగా సాగుతున్నాయి. అదే సమయంలో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతులు మాత్రం పెరగకపోవడం ట్రాఫిక్ సమస్యను తీవ్రతరం చేస్తోంది.
- అక్షరటుడే, కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంగా ఏర్పడి పదేళ్లు పూర్తయినా పట్టణ రహదారుల విస్తరణ మాత్రం అక్కడే ఆగిపోయింది. గత ప్రభుత్వం సుందరీకరణ పనులపై దృష్టి పెట్టిందే తప్ప రోడ్ల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధిపై ఫోకస్ చేయలేదనే విమర్శలు ఉన్నాయి. పట్టణ పరిధి పెరుగుతున్నా, జనాభా, వాహనాలు పెరుగుతున్నా ఇరుకు రోడ్లే దిక్కయ్యాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి.

జంక్షన్ల అభివృద్ధిలో నిర్లక్ష్యం

పట్టణంలోని ప్రధాన కూడళ్లయిన ఇందిరాగాంధీ చౌరస్తా, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ ఏరియాల్లో ఇప్పటికీ సరైన జంక్షన్ల ఏర్పాటు జరగలేదు. జంక్షన్ల అభివృద్ధి కోసం నిధులు మంజూరైనప్పటికీ అడుగులు ముందుకు పడటం లేదు. వచ్చిన నిధులు ఉన్నాయో.. లేక ఇతర పనులకు మళ్లించారో తెలియని పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ సరిగా పని చేయకపోవడం, ట్రాఫిక్ పోలీసుల కొరతతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. స్కూల్, కాలేజీ సమయాల్లో, సాయంత్రం వేళల్లో ఈ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోవడం నిత్యకృత్యంగా మారింది.

పార్కింగ్ స్థలాల గుర్తింపుపై నిర్లక్ష్యం

ప్రధాన రహదారుల వెంట వందలాది దుకాణాలు వెలిశాయి. దుకాణ యజమానుల వద్ద అనుమతులు తీసుకుని రోడ్డుకు ఆనుకుని మరికొన్ని చిరు వ్యాపారాలు కొనసాగుతుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు ఇప్పటికి అనేకసార్లు మున్సిపల్, పోలీసు అధికారులు రహదారి వెంట పార్కింగ్ కోసం మార్కింగ్ చేశారు. కొన్నిరోజుల పాటు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు ఆ తర్వాత పార్కింగ్ స్థలాల ఏర్పాటును పూర్తిగా మర్చిపోయారు.

పరిష్కారం ఎప్పుడో?

పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణ, కొత్త జంక్షన్ల ఏర్పాటు, శాటిలైట్ పార్కింగ్ స్థలాల గుర్తింపు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారానికి అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది. కామారెడ్డి జిల్లా ఏర్పడి పదేళ్లవుతున్నా జిల్లా కేంద్రంలో ఉండాల్సిన కనీస వసతులు లేకపోవడం పట్ల పట్టణ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇకనైనా నాయకులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కింగ్ లేక వాహనదారుల అవస్థలు

పట్టణంలో అతిపెద్ద సమస్యగా పార్కింగ్ మారింది. నిత్యం వేలాది వాహనాలు పట్టణానికి వస్తున్నా ఇప్పటివరకు అధికారికంగా ఒక్క పార్కింగ్ స్థలాన్ని కూడా మున్సిపాలిటీ గుర్తించలేదు. దీంతో వాహనదారులు రోడ్లపైనే వాహనాలు నిలపడంతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం కలుగుతోంది. వాణిజ్య సముదాయాల వద్ద పార్కింగ్ సౌకర్యం లేకపోవడం, ఇటీవల ప్రధాన రహదారిపై షాపింగ్ మాల్స్ ఏర్పాటు కావడంతో ప్రధాన రహదారులన్నీ పార్కింగ్ స్థలాలుగా మారిపోయాయి.



బాల్కొండలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

అక్షరటుడే, బాల్కొండ: మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం బాల్కొండ మండల కేంద్రంలో పర్యటించారు. మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ షాహిద్ సోదరుడికి ఇటీవల వివాహం జరిగిన నేపథ్యంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ పర్యటనలో సర్పంచ్ గాండ్ల రాజేష్, సీనియర్ నాయకులు దాసరి వెంకటేష్, సాగర్ యాదవ్, బాలరాజు, కన్న పోశెట్టి, కిసాన్ నగర్ సర్పంచ్ రామరాజు గౌడ్, నారాయణ, గంగా రెడ్డి, వాహిద్ ఉన్నారు.

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : బిగాల



అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు సాగునీరు అందించడంతో పాటు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులకు సమయానికి పంట పెట్టుబడి అందక, యూరియా లభించక, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతూ, సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వ్యవసాయాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం రైతుల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎల్‌నినో ప్రభావాన్ని కారణంగా చూపిస్తూ, అధికారులతో సమీక్షలు నిర్వహించడం ద్వారా సమస్యలు పరిష్కారం కావన్నారు. సమస్యలకు అధికారులే కారణమన్నట్లుగా వారిని తప్పుబట్టడం, సస్పెన్షన్ల పేరుతో బెదిరించడం కంటే, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిలబడుతుందన్నారు.



మారుమూల గిరిజన పల్లెలకూ మిషన్ భగీరథ జలాలు

అక్షరటుడే నిజామాబాద్ సిటీ: మామూమూల గిరిజన ప్రాంతాలకు సైతం మిషన్ భగిరథ ద్వారా రక్షిత మంచినీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మోపాల్ మండలం అమ్రాబాద్ తండాను కలెక్టర్ గురువారం సందర్శించారు. మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణంలో పలు తండాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో ఇదివరకు అమ్రాబాద్ తండా సహా సుమారు 11 నివాస ప్రాంతాలకు మిషన్ భగీరథ పైప్ లైన్లు ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో ప్రస్తుతం ఆ ప్రాంతాలకు మిషన్ భగీరథ జలాలు అందించేందుకు వీలుగా అనువైన పరిస్థితులను పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో సందర్శించామన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని నివాస ప్రాంతాలకు రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా అనుకూలమైన ప్రదేశంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించాలని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలకు తాగునీటి సరఫరాను అందుబాటులోకి తెచ్చి జల్ జీవన్ మిషన్ కింద కవర్ అయ్యేలా చూడాలన్నారు. కాగా, ఎల్ నినో ప్రభావం వల్ల ఆశించిన రీతిలో వర్షాలు కురియక నీటి నిల్వలు అంతంతమాత్రంగానే ఉన్నాయని ఆరుతడి పంటలే సాగు చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఆర్డీవో రాజేంద్రకుమార్, మిషన్ భగీరథ ఈఈ రాకేష్, మోపాల్ తహశీల్దార్ రేఖ, సర్పంచ్ ప్రియాంక తదితరులు ఉన్నారు.



శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఇందూరు నృత్యకళాకారుల ప్రతిభ



అక్షరటుడే, ఇందూరు: తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో ఇందూరు నగరానికి చెందిన కళాకారులు పేరిణి నాట్యం, తాండవం చేసి తమ ప్రతిభను చాటారు. తిరుమల లో జరుగుతున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో నగరంలోని ధనిత డ్యాన్స్ అకాడమీ గురువు పేరిణి సతీష్ ఆధ్వర్యంలో 45మంది అద్భుతమైన పేరిణి నృత్యం, తాండవం చేశారు. రమాదేవి బృందంలో వేంకటేశ్వర స్వామి గెటప్‌లో తోట వైనవి, గోదాదేవిగా హర్షిత, లక్ష్మీదేవిగా సాయి సుధేష్ణ, శివుడిగా శ్రీహిత, పార్వతిగా సహస్ర తమ అభినయాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో రవిచంద్ర నృత్యాకళాకారులను ప్రత్యేకంగా అభినందించారు.



ఎట్టకేలకు పబ్లిక్ స్కూల్ కల సాకారం : ఎమ్మెల్యే ధన్‌పాల్

అక్షరటుడే,ఇందూరు: తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణం కోసం తాను ప్రతిపాదన పంపడంతో ప్రభుత్వం మంజూరు చేసిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి గురువారం నగరంలోని కోటగల్లి బాలికల ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో రెండు పబ్లిక్ స్కూల్ లను ఎంపిక చేశారన్నారు. ఇందులో భాగంగా అర్బన్ నియోజకవర్గంకు సంబంధించి నగరంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారని తెలిపారు. తాను గతంలో అనేకసార్లు పాఠశాలను పరిశీలించి, ఇక్కడి పరిస్థితిని చూసి పబ్లిక్ స్కూల్ కోసం ప్రతిపాదన పంపించానని ఎప్పారు. సుమారు 2 వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని గుర్తుచేశారు. పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. అయితే నిధులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేసి, టెండర్లను ఆహ్వానిస్తామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులో తీసుకొచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భుజంగరావు, మేయర్ ఉమారాణి, కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, బీజేపీ కార్పొరేటర్లు ప్రసన్న శ్యామల సత్యపాల్, నాగోల్ల లక్ష్మీనారాయణ, చింతకాయల రాజేందర్, అధికారులు పాల్గొన్నారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
గురువారం
15.10.2026

www.aksharatoday.in
AKSHARA TODAY

డీఎల్‌డీవోల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా : మదన్ మోహన్



అక్షరటుడే,ఎల్లారెడ్డి: డీఎల్‌డీవోల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల పశుసంవర్ధక అభివృద్ధి అధికారులు (డీఎల్‌డీఓలు) ఎమ్మెల్యేను కలువగా ఆయన స్పందించారు. డీఎల్‌డీవో పోస్టు ప్రాధాన్యతను, పశుసంవర్ధక రంగంలో ఏఎల్‌పీ సంస్కరణల అమలులో ఆ పోస్టు పోషిస్తున్న కీలక పాత్రను ఎమ్మెల్యేకు వివరించారు. స్టేట్ ట్రెజరీ కార్యాలయం (ఎస్‌టీఓ) ద్వారా అందుతున్న వాహన అలవెన్స్ కొన్ని నెలలకు మాత్రమే పరిమితమవుతోందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. విధుల నిర్వహణలో ఎదురవుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వాహన అలవెన్స్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎల్‌డీవో పోస్టు ప్రాధాన్యతను గుర్తించి, సంబంధిత సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు ఎమ్మెల్యేను అభ్యర్థించారు. దీనిపై ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సానుకూలంగా స్పందించారు.



డ్రైనేజ, సోక్‌పిట్స్ పనుల పరిశీలన

అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండలంలోని గగ్గుపల్లి గ్రామంలో జరుగుతున్న డ్రైనేజీ, సోక్‌పిట్స్ నిర్మాణ పనులను గురువారం ఎంపీడీవో లక్ష్మారెడ్డి తనిఖీలు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, వాటి నిర్వహణపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా భవిష్యత్తులో గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షనీటిని భూమిలోకి ఇంకించేలా ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రోత్సహించాలని, భూగర్భ జలాల సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామంలో మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, సోక్ పిట్స్ నిర్మాణాలను నిబంధనల ప్రకారం చేపట్టి వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచ్ కొండి గంగాధర్, కార్యదర్శి కిషోర్ పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి పూజలు..



దేవునిపల్లి దుర్గాసేవా సమితి ఆధ్వర్యంలో..

లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనం




గాజుల్‌పేట్‌లో అంబే భవానీ కమిటీ ఆధ్వర్యంలో..

ఉమ్మడిజిల్లాలో దుర్గామాత మండపాల్లో సందడి నెలకొంది. ఐదోరోజు అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. ఆయా మండపాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. పలుచోట్ల గురువారం అన్నదానాలు జరిగాయి.
– అక్షరటుడే, నెట్‌వర్క్



వినాయక్ నగర్‌లోని ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ లో..



ఆర్మూర్ హౌసింగ్ బోర్డు కాలనీ లో..



ఆర్మూర్ జర్నలిస్ట్ కాలనీలో..



విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో..



వినాయక్‌నగర్ నవదుర్గ మహిళా మండలి ఆధ్వర్యంలో..



యాదగిరి బాగ్‌లో బ్రహ్మవదిని మండపంలో..



జెండా గల్లీలోని గోవెరెడ్డి సంఘం ఆధ్వర్యంలో..



గాజుల్‌పేట్‌లో..

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి అర్జున్ గంగ ఎంపిక



అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం .అర్జున్ గంగ రాష్ట్రస్థాయి అండర్ 13 సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. హనుమకొండలో ఈనెల 16, 17 తేదీల్లో ఈ పోటీలు జరుగనున్నాయన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ.. అర్జున్ గంగ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ శివకుమార్, ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.



వెలుట్లపేటలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ

అక్షరటుడే, ఎల్లారెడ్డి: మండలంలోని వెలుట్ల పేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ కొయ్యల వినోద రాజ గౌడ్, ఉపసర్పంచ్ కర్రిచెవుల రాజు యాదవ్, గ్రామ అధ్యక్షుడు పెంట అంజయ్య, కురుమ సాయిబాబా, గోచిక గణపతి, నాగం గోపి, పద్మ శ్రీకాంత్, గంట సాయిలు, కమ్మరి భాస్కర్, డాక్టర్ శివాజీ, బట్టి సాయగౌడ్, బంధం భూమయ్య పాల్గొన్నారు.



మార్కండేయ మందిరం పునర్నిర్మాణానికి కసరత్తు

అక్షరటుడే, బాల్కొండ: మండల కేంద్రంలోని మార్కండేయ మందిరం పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చును అంచనా వేసేందుకు దేవాదాయ శాఖ ఏఈ రమేష్, స్థపతి వెంకటేష్ గురువారం ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలోని విగ్రహాలు, పరిసరాలను పరిశీలించి, పునర్నిర్మాణ పనులకు అవసరమైన కొలతలు తీసుకున్నారు. ఈ కొలతల ఆధారంగా పనుల అంచనా ఖర్చును సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. బాల్కొండ పద్మశాలి సంఘం అధ్యక్షుడు అంద వెంకటగిరి, కోశాధికారి కుందారపు శ్రీనివాస్, కార్యదర్శి మేక నాగేష్, మైసరి పెద్ద గంగాధర్, భోగ గంగా కిషన్, బోగా భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడిగా గోండాల సురేష్ బాబు



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా గోండాల (బ్యాగుల) సురేష్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే అధికారులు వివరాలు వెల్లడించారు. ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి మోహన్, గౌరవ అధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు సరేష్‌బాబు నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించి, ఈ అవకాశం కల్పించిన ఎంపీ అర్వింద్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, రైల్వే అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.


ఐవోసీ ఆధ్వర్యంలో జీజీహెచ్‌కు వైద్య పరికరాల అందజేత



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని జీజీహెచ్‌లో వైద్య మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు ఐవోసీ ముందుకొచ్చింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత పథకం కింద, 'నిర్మాణ్ ఆర్గనైజేషన్' సహకారంతో సుమారు రూ. 65 లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలను ఆస్పత్రికి సమకూర్చింది. పీడియాట్రిక్స్ విభాగం ప్రొఫెసర్, జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ శ్రీనివాస్, జనరల్ మెడిసిన్ విభాగం అధిపతి జలగం తిరుపతిరావు ప్రత్యేక పర్యవేక్షణలో ఈ పరికరాలు సీఎస్ఆర్ పథకం ద్వారా మంజూరయ్యాయి. గురువారం ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్ (ఆర్థోవోటీ) లేబర్ రూమ్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ పరికరాలను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. కృష్ణ మోహన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎల్. రాములు ప్రారంభించారు. మూడు వెంటిలేటర్లు, 3 బబుల్ సీపా, 1 సీఆర్ఎం యంత్రం, 5 సీఆర్ క్యాసెట్లు, 10 సిరంజి పంపులు, 6 ప్రసవ పట్టికలు, 2 కార్డియోటోకోగ్రఫీ యంత్రాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. కృష్ణ మోహన్, సూపరింటెండెంట్ రాములు మాట్లాడుతూ.. ఈ పరికరాల అందుబాటుతో శస్త్రచికిత్సలు, ప్రసూతి సేవలు, నవజాత శిశువుల అత్యవసర సంరక్షణ మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందుతాయని తెలిపారు.

ఎల్లారెడ్డిలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

అక్షరటుడే,ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో 225 మందికి రూ.2.40 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్, 33 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 8 మండలాల పరిధిలోని 225 మంది లబ్ధిదారులకు రూ. 2.40 కోట్ల విలువైన చెక్కులు అందజేశారు. నాగిరెడ్డిపేట మండలంలో 16 మంది చొప్పున మొత్తం 33 మందికి ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరంతరం అందుతాయని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు చేరవేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



అక్షరటుడే, గాంధారి: బొలెరో వాహనం.. టైర్ వచ్చి ఢీకొన్న ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం మండలంలోని శ్రీకృష్ణ దాబా సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని పోతంగల్ కలాన్‌కు చెందిన వడ్ల అరుణ్ కామారెడ్డి నుండి గాంధారికి వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం వెనక టైర్ ఊడిపోయి అరుణ్ బైక్‌కు తగిలింది. దీంతో కిందపడ్డ అరుణ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా స్పందించిన సిబ్బంది క్షతగాత్రుడిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బంది ఈఎంటీ కమలాకర్, పైలట్ ప్రకాష్ గౌడ్‌ను స్థానికులు అభినందించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



అక్షరటుడే, కామారెడ్డి : హత్య కేసులో ఓ నిందితుడికి జీవిత ఖైదు పడిందని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. పెద్దకొడప్‌గల్‌కు చెందిన బస్వరాజ్ 2023 నవంబర్ 25న కనిపించకుండా పోయాడు. అతని బామ్మ మెట్టు మీది పాపవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు వెతకగా మూడు రోజుల తర్వాత అదే గ్రామానికి చెందిన కారాడి సాయికుమార్ అలియాస్ సాయిలు నిర్మాణంలో ఉన్న ఇంటి సెప్టిక్ ట్యాంకులో బస్వరాజ్ మృతదేహం కాళ్లకు తాడు కట్టి ఉన్న స్థితిలో లభించింది. విచారణలో నిందితుడు స్థలం అమ్మగా వచ్చిన రూ.25 లక్షల కోసం బస్వరాజ్ డబ్బు అడగడంతో హత్యకు పథకం వేసినట్లు తేలింది. విందు పేరుతో పిలిచి మద్యం తాగించి, అర్ధరాత్రి గొడవ జరగడంతో కులం పేరుతో దూషిస్తూ కర్రతో తలపై కొట్టి, కొబ్బరి తాడుతో మెడ బిగించి, కాళ్లు కట్టేసి ట్యాంకులో పడవేసి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. సాక్షుల విచారణ, ఆధారాల పరిశీలన అనంతరం నిజామాబాద్ రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (ఎస్సీ, ఎస్టీ కోర్టు) ఎస్. నారాయణ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

పిప్రిలో ఘనంగా మహిళా కిసాన్ దివస్



అక్షరటుడే, ఆర్మూర్ : ఆర్మూర్ మండలం పిప్రిలో మహిళా కిసాన్ దివస్ వేడుకలను పురస్కరించుకుని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ రంగంలో విత్తనాలు నాటడం నుంచి పంటల సంరక్షణ వరకు మహిళల పాత్ర ఎంతో కీలకమని ఏడీఏ విజయలక్ష్మి తెలిపారు. ఎర్రజొన్న సాగు చేసే రైతులు డీలర్లతో చేసుకునే ఒప్పంద నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలని ఏఓ హరికృష్ణ సూచించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతంలో మార్పులు ఉండే అవకాశం ఉన్నందున, తక్కువ నీటితో పండే కంది, జొన్న, సజ్జ వంటి ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా రైతులు శారద, గంగమణిలను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ కిరణ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఏఈఓలు, మహిళా రైతులు పాల్గొన్నారు.